# భగవదంశ

## అంతర్యామి

దైవానికి, దానవుడికి మధ్య తేడా ఏమిటో లోకంలో అందరికీ తెలుసు. దేవుణ్ని ఇష్టపడతారు. రాక్షస చర్యల్ని ఖండిస్తారు. మనిషి స్వతహాగా బుద్ధిజీవి. దేవుణ్ని అతడు రూపు రేఖలతో చిత్రించాడు. దేవుడి పేరును తనకు నామకరణం చేసుకున్నాడు. దైవత్వ రూపాన్ని పదేపదే మననం చేసుకునే ప్రయత్నమది. మనిషికి దైవానికి తేడా లేదని చాటిచెప్పడమన్నా అదే!

ఆ అంతర్యామి మనిషికి జీవితమిచ్చింది దేనికి? జంతువు నుంచి వేరుచేస్తూ, విచక్షణతో కూడిన జీవితాన్ని అతడికి ప్రసాదించింది ఎందుకు? మనిషి దైవమార్గంలో నడవాలి. క్రమంగా ఆ స్థాయికి దగ్గర కావాలి. అలా జరగడం లేదు. మాటలతో, చేతలతోనూ మనిషి ఆ దైవానికి దూరమవుతున్నాడు.

ఏ మనిషిలోనైనా మంచి, చెడు అనే రెండు పార్శ్వాలుంటాయి. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి అవి బహిర్గతమవుతాయి. కొందరు నైతిక విలువలకు కట్టుబడి ఉంటారు. తాము నమ్మిన సిద్ధాంతాల్ని ఆచరిస్తుంటారు. మరికొంతమందికి జీవించడమే ప్రధానం. 'ఎలా బతుకుతున్నాం' అనే ప్రశ్నే వాళ్లలో తలెత్తదు. ఆదర్శాలు పట్టవు. సాటి మనుషుల్నే మెట్లుగా చేసుకుని, నిచ్చెన ఎక్కుతుంటారు. అలా శిఖరాగ్రం చేరినా ఏమీ సాధించనట్లే అని వాళ్లు తెలుసుకోరు!

పురాణాలు జీవిత పాఠాలు నేర్పుతాయి. అవి కేవలం ఏ పుణ్యం కోసమో పఠించే పారాయణ గ్రంథాలు కావు. ఉత్తమ పాఠాలు బోధించే గురువులు అవి. పలు సందర్భాల్లో- శిబి చక్రవర్తి, సత్య హరిశ్చంద్రుడు, కర్ణుడు, ద్రోణుడు, భీష్ముడు వంటి ఒక్కో పాత్రా మానవాళికి మార్గనిర్దేశం చేస్తాయి. లోకంలో ఎలా మనుగడ సాగించాలో నేర్పుతాయి. మధ్యమధ్యలో రాక్షస పాత్రలు తారసపడుతుంటాయి. అధర్మం, అధమత్వం చివరికి ఎలా నశించిపోతాయో పురాణాలే విశదీకరిస్తాయి.



మాలిన్యం అంటని రీతిలో, తామరాకు మీద నీటిబొట్టులా సాగాలి మానవ జీవితం. అందుకే అతడి మనసును బోధకులు దారి తప్పనివ్వరు. పాపం, పుణ్యం అని లౌకికంగా గీతలు గీసి హెచ్చరిస్తుంటారు. ఆ ప్రవచనాలు మనిషి తనను తాను సంస్కరించుకోవడానికి ఎంతో తోడ్పడతాయి. అటువంటి అవకాశం, అదృష్టం సృష్టిలోని ఏ ఇతర ప్రాణులకూ లభించవు!

మార్పు అనేది మనిషి లోపలి నుంచే మొదలు కావాలంటారు పెద్దలు. అతడు మారితేనే కుటుంబం మారుతుంది. సంఘమూ మార్పు చెందుతుంది. మనిషి మంచి నడవడిక అలవరచుకొని- మాటల్లో నిబద్ధత, మధురత కనబరచాలి. ఆ వ్యక్తిత్వ ప్రభావం జనక్షేత్రంలో నదీమతల్లిలా ప్రవహిస్తే, ఆ నీటితోనే దాహం తీర్చుకోవాలని ప్రతి ఒక్కరూ తపిస్తారు. మోడుకు చిగురించే శక్తి ఉందో లేదో, నాలుగు వాన చినుకులు పడితేనే తెలుస్తుంది. అలాగే పరిస్థితుల ప్రభావం వల్ల కొందరి మనసు బండరాయిలా మారినా, ఏ మహానుభావుడి మంచి మాటలో దాన్ని పునీతం చేయవచ్చు. అప్పుడు ప్రాపంచిక విషయాల కంటే, పారమార్థిక చింతనకే సమయం కేటాయించాలన్న భావన బలంగా చోటు చేసుకుంటుంది. మనసా వాచా అదే ఆశయంతో వ్యవహరిస్తాడు. ప్రతి అభ్యాగతుడిలోనూ భగవానుణ్ని దర్శిస్తాడు. సృష్టిని కన్నతల్లిగా భావిస్తాడు. ఇతర ప్రాణుల్ని సమభావంతో అక్కున చేర్చుకుంటాడు. ఆ భావమే అతడికి విముక్తి కలిగిస్తుంది. అక్కడే భగవదంశ వెల్లివిరుస్తుంది. అంతకు మించిన జన్మ సాఫల్యత మరొకటి ఉండదు.

మనిషి సాధన- ప్రపంచానికి అతణ్ని దూరం చేయకూడదు. అంతర్యామిని అర్థం చేసుకోవడానికి అతడు పాట్లు పడాల్సిన పనే లేదు. సేవాభావంలోని మాధుర్యాన్ని అనుభూతి చెందకుండా, ఎక్కడెక్కడికో వెళ్లడం మానసికంగా తాత్కాలిక ఉపశమనాన్నే కలిగిస్తుంది. శంకరాచార్యులవారికి మనిషిలోనే శివుడి దర్శన భాగ్యం కలిగిందంటారు. సకల చరాచర సృష్టీ అంతర్యామిలోనే నిక్షిప్తమై ఉందని ప్రహ్లాదుడు తన తండ్రిని హెచ్చరించాడు. ప్రతి జీవిలోనూ తానుంటానని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించడానికి కారణం- మనిషి నుంచి తాను వేరు కాదని స్పష్టంచేయడం. ఈ సూక్ష్మం తెలుసుకుంటే, మానవ జీవితం ధన్యమే!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు